
సమావేశంలో ఎమ్మెల్యే బలాల, తీగల కృష్ణారెడ్డి, కార్పొరేటర్ అరుణ

తిరుమలహిల్స్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలహిల్స్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శుక్రవారం తిరుమలహిల్స్‌లో కాలనీ అధ్యక్షుడు, మాజీ నగర మేయర్ తీగల కృష్ణారెడ్డి నివాసంలో కాలనీవాసులు, అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ వేత్తలు, వ్యాపారవేత్తలు నివసించే తిరుమలహిల్స్‌కాలనీలో ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరించడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డిని కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి అర్జున్, సంతోష్, సురేంద్రనాథ్, కళ్యాణ్, ప్రభాకర్‌రెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, విజయానందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, సాయిబాబా, సత్యం, కోటేష్ పాల్గొన్నారు.


ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

సదర్ మేళాను జయప్రదం చేయండి

సైదాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ఆధ్వర్యంలో దీపావళి మరుసటి రోజు నవంబరు 1న సైదాబాద్‌లో నిర్వహించే సదర్ మేళా ఉత్సవాలను జయప్రదం చేయాలని అఖిలభారత యాదవ మహాసభ గ్రేటర్ అధ్యక్షుడు మైలేకోల్ మహేందర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం సైదాబాద్ శ్రీపసన్నాంజనేయస్వామి ఆలయంలో సదర్ ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, యాదవ సంఘం పెద్దలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలంయాదవ్, సుధాకర్‌యాదవ్, గడ్డం కృష్ణయాదవ్, సంతోష్‌యాదవ్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.


శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దీపికాశేఖర్‌రెడ్డి

మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి సాధించాలి : కార్పొరేటర్

సరూర్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, ఏదో ఒక వృత్తిలో నిలదొక్కుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఇక్కడి వినాయకహిల్స్ కమ్యూనిటీ హాల్‌లో జనశిక్షణ సంస్థ రంగారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపికారెడ్డి మాట్లాడుతూ బ్యూటీషియన్, టైలరింగ్, క్యాండిల్ మేకింగ్ వంటి అంశాల్లో మహిళలు శిక్షణ పొందాలని, వాటి ద్వారా కచ్చితంగా స్వయం ఉపాధి సాధ్యమవుతుందని అన్నారు. ఆసక్తి గల మహిళలు జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని వృత్తి నైపుణ్యాన్ని సాధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కాలనీ మహిళలు, నాయకులు పాల్గొన్నారు.


అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేస్తున్న లక్ష్మీనారాయణ

ఆర్యవైశ్యులు సమాజసేవకు కృషి చేయాలి

వనస్థలిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింతగా బలపడి సమాజసేవకు కృషి చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా గందే సురేష్‌గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం వనస్థలిపురంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గందే సురేష్‌గుప్తాకు అమరవాది లక్ష్మీనారాయణ నియామకపత్రం అందజేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింతగా బలపడి చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గణేష్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ చైర్మన్ చింతల రవికుమార్‌గుప్తా, లక్ష్మయ్యగుప్తా, కిరణ్, రవీందర్, రంగయ్య, జయరాములు పాల్గొన్నారు.


దిల్‌సుఖ్‌నగర్ డిపో సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులను అందజేస్తున్న డిపో మేనేజర్ సమత

24 మందికి ప్రగతి చక్ర అవార్డుల ప్రదానం

చాదర్‌ఘాట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో ఆదాయాన్ని పెంచడంలో కృషి చేసిన 24మంది సిబ్బందిని ప్రగతి చక్ర అవార్డులతో సత్కరించినట్లు డిపో మేనేజర్ టి.సమత తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు మాసంలో దిల్‌సుఖ్‌నగర్ డిపో ఆదాయా న్ని పెంచడంలో ప్రతిభ కనబరచినందుకు గాను ఏడుగురు కండక్టర్లను, 27 మంది డ్రైవర్లను, ముగ్గురు మెకానిక్‌లను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తిం చి నగదు పురస్కారాలతోపాటు ప్రగతిచక్ర అవార్డులను అందజేసి అభినందించారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడం ద్వారా సంస్థ మనుగడతోపా టు మరింత పురోగాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసాన్ని డిపో మేనేజర్ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎన్.వెంకన్న, ఎం ఎఫ్ వెంకటేశ్, సూపర్‌వైజర్లు బుచ్చిరెడ్డి, ఎంవీఎన్‌రావు, ఏఎస్‌రావు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మూసీ ఒడ్డున నివసిస్తున్న వారికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు - ధర్నాచౌక్‌లో నిర్వహించిన మూసీ బాధితులకు బీజేపీ తోడు ..మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ప్రశ్నిస్తున్నా తెలంగాణ అనుమతులు ఇచ్చినోళ్లపై చర్యలేవి.. అమాయకుల ఇళ్లపై చెలరేగుడేంది. నినాదం ఉన్న ప్లకార్డును ఆయన ప్రదర్శించారు.

ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

- ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి
- అధిక ధరలు వసూలు చేస్తున్న మీసేవలపై చర్యలు
- అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

ఇంటర్వ్యూ...



అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భూములపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. భూముల ఆక్రమణ, కబ్జాకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనకాడబోమని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల రక్షణ, రెవెన్యూ సేవలపై శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తహసీల్దార్ పలు వివరాలు వెల్లడించారు.

మండలంలో ప్రభుత్వ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఉన్నత అధికారుల ఆదేశాలతో ప్రభుత్వ భూముల రక్షణపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఆర్ఐలు, ఇతర సిబ్బందితో కలిసి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నాం. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లి సర్వేచేసి ప్రభుత్వ భూమిలో ఉంటే వాటిని తొలగిస్తున్నాం. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఆక్రమణలను కూల్చివేశాం.

మీసేవ సెంటర్ల నిర్వహకులు దరఖాస్తుదారుల వద్ద ఎక్కువ రుసుము వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై మీ సమాధానం..?

మీసేవ సెంటర్లపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవమే. మండల పరిధిలో మొత్తం 12 మీసేవ సెంటర్లు పనిచేస్తున్నాయి. ఈ విషయంపై రెండు రోజుల క్రితమే మీసేవ సెంటర్ల నిర్వాహకులతో కార్యాలయంలో సమావేశం నిర్వహించాం. ప్రభుత్వం ఆమోదించిన ఫీజు కంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. అవసరమైతే మీసేవ అనుమతులను రద్దు చేస్తామని తెలిపాం.

భూదాన్, సీలింగ్ భూముల ఆక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో భూదాన్, సీలింగ్ భూముల సమస్య ఉన్నది. అక్కడ ఏడీ సర్వే చేయిస్తున్నాం. సబ్ డివిజన్ కాకపోవడంతో కొంత ఇబ్బందికలుగుతుంది. భూదాన్ భూముల్లో ఎక్కడైనా ఆక్రమణలు జరిగినట్లు తెలిసిన వెంటనే వాటిని కూల్చివేస్తున్నాం. సీలింగ్ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

చెరువు, కుంటల్లో ఆక్రమణపై చర్యలు ఉంటాయా..?

తప్పకుండా చర్యలు ఉంటాయి. హెచ్ఎండీఏకు ఫైనల్ నోటిఫికేషన్ పంపిస్తున్నాం. అక్కడి నుంచి వచ్చిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆక్రమణపై కఠిన చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఆ కార్యక్రమం ఉంటుంది.

సర్టిఫికెట్‌లను ఎన్ని రోజుల్లో జారీ చేస్తున్నారు..?

సర్టిఫికెట్ల విషయంలో జాప్యం చేయడం లేదు. అత్యవసరం అయితే వారం అంతకంటే ముందుగానే జారీ చేస్తున్నాం. సర్టిఫికెట్ల జారీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టడం లేదు.

ప్రభుత్వ పాఠశాల స్థల పరిరక్షణకు చొరవ చూపండి

- బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో వినతి

మన్సూరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 74ఏళ్లుగా ప్రైవేటు భవనంలోనే కొనసాగుతున్న బండ్లగూడ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని, ఈ స్థలాన్ని సర్వేచేసి పాఠశాలకు చెందేలా పొజిషన్ ఇవ్వాలంటూ బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రైవేటు భవనంలోనే కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలకు 1998లో నాటి ప్రభుత్వం బండ్లగూడ గ్రామంలోని సర్వేనంబర్ 36/6లో ఒక ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించగా ఆ స్థలంలో పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారన్నారు. వెంటనే కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇది తమ స్థలమని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశానుసారం నాటి తహసీల్దార్ సర్వే చేపట్టి అందించిన నివేదిక ప్రకారం ప్రభుత్వ భూమిగా కోర్టు తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తులు జిల్లా కోర్టును ఆశ్రయించగా ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దంటూ కోర్టు స్టే విధించడంతో నాటి నుంచి కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఈ క్రమంలో రెవెన్యూ, విద్యాశాఖలు స్పందించకపోవడంతో జిల్లా కోర్టులో వారికి కేసు అనుకూలంగా వచ్చిందంటూ సోమవారం జేసీబీ సాయంతో అప్పటికే నిర్మాణం చేపట్టిన పాఠశాల భవనాన్ని, ప్రహరీని కూల్చివేశారన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, విద్యాశాఖలు స్పందించకపోవడంతో ప్రభుత్వ భూముల పరిరక్షణ పట్ల వారికున్న నిబద్ధత అర్థమవుతుందన్నారు. వెంటనే ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిరక్షించడంతో పాటు కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అంతకుముందు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను కలిసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు మెట్టు రవీందర్‌గౌడ్, చెరుకు భవానీశంకర్, శ్రీనివాస్‌చారి, పంగ గౌతమ్, సహదేవ్‌గౌడ్, పాండుగౌడ్, రామారావు, బండ్లగూడ గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సమస్యను టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు వివరిస్తున్న సభ్యులు

తెలంగాణ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- పోటీ పడుతున్న 32 జట్లు

సరూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో గల జీఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ యువజన విభాగం రంగారెడ్డి జిల్లా కమిటీ మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు ఆధ్వర్యంలో తెలంగాణ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 32 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు జట్లకు చెందిన ఆటగాళ్లను పరిచయం చేసుకుని, అనంతరం టాస్ వేసి తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత బాల్, బ్యాట్ పట్టి కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరం యువతీ యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకుని, ఏదో ఒక ఆటలో నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేహూరి ధర్మేందర్‌రెడ్డి, పాశం శ్రీధర్, బత్తుల నాగార్జునగౌడ్, గుర్రం శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, నవీన్ సింగిడి, ప్రదీప్‌కురుమ పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు

ప్రైవేటు పాఠశాలను సందర్శించిన జేమి నైట్

హయత్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఫ్రీస్టైలర్ జేమి నైట్ శుక్రవారం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు ఫుట్‌బాల్ క్రీడపై అవగాహన కల్పించారు. అనంతరం ఫ్రీస్టైలర్ జేమి నైట్ మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడలో భారత్ గ్లోబర్ ప్లేయర్‌గా మారడానికి అవకా శం ఉందన్నారు. త్వరలో జరగనున్న ప్రపంచ కప్ పోటీల్లో భారత్ పాల్గొనే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఫుట్‌బాల్ ఎలా ఆడాలో చూపించి అందులోని మెలకువలను నేర్పించారు. ఫుట్‌బాల్‌తో రకరకాల విన్యాసాలు చేశారు. విద్యార్థుల ప్రశ్నలకు జేమి నైట్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఫుట్‌బాల్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫ్రీస్టైలర్ జేమి నైట్

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి : సీఐటీయూ

ఎల్బీనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఆరోగ్య కారణాలతో పనిచేయలేకపోతున్న కార్మికుల స్థానంలో వారి వారసులను నియమించాలని కోరారు. వారసుల నియామకంలో జరుగుతున్న జాప్యానికి జీహెచ్ఎంసీ బాధ్యత వహించాలన్నారు. వారసుల నియామకంలో డబ్బులు ఇచ్చిన వారిని నియమిస్తూ ఇవ్వని వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని వారు మండిపడ్డారు. మిడ్ పంచ్ విధానాన్ని ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనాలు ఇవ్వాలని వారు కోరారు. పారిశుధ్య సేవలను ప్రైవేటీకరించాలన్న ఆలోచనను విరమించుకోవాలని వారు సూచించారు. జీహెచ్ఎంసీ కార్మికులలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, సీహెచ్ వెంకన్న, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జంగయ్య, కమిటీ సభ్యులు యాదమ్మ, జయమ్మ, కలమ్మ, అంజమ్మ, ఎల్లమ్మ, బుచ్చమ్మ, పద్మ, లక్ష్మి, అరుణ, సంతోష, మంజుల, లక్ష్మీదేవి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, ఎల్లయ్య

సీఎం స్నేహితుడు మా భూమిని కబ్జా చేశారు

- సీఎం రేవంత్ జోక్యం చేసుకోవాలని బాధితుల విన్నపం
- నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపణ

ఖైరతాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారులకు పోలీసులు అండగా ఉండి వేధింపులకు పాల్పడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని తమ భూమి తమకు అప్పగించాలని బాధితులు వేడుకున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, ఆయన కుమారుడు రాకేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్ శేఖర్‌రెడ్డి, బాధితులు ఎస్.అరుణాదేవి, ఎస్.కృష్ణ మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తిరుమలగిరిలోని సర్వే నెంబర్లు 398, 399, 409, 410, 411/1, 411/2, 579లోని మొత్తం 19.18 ఎకరాల భూమిని తాము 1968లో కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. అయితే కొంతకాలం క్రితం సీఎం స్నేహితుడు తమ భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ దాదాపు 100 మంది ఆయుధాలతో తమ స్థలంలో ఉన్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి రెండు సార్లు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సూర్యనారాయణ రెడ్డి సైతం బాధితుడిగా మారినట్లు వారు తెలిపారు. రాచకొండ సీపీని కలవగా తమనే బెదిరించారని, హన్మంతరావు ద్వారా సీఎం రేవంత్ బ్రదర్స్‌ను కలవాలని చెప్పారని ఆరోపించారు. ఈ విషయంపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.


రేకుల షెడ్ల ఫొటోలు చూపిస్తున్న బాధితులు

తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

ఈ భూమి విషయంపై దర్యాప్తు నడుస్తోందని.. ఈ క్రమంలో కొందరు నిరాధారమైన కథనాలు, వీడియోలు పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాక, పోలీసులపై, ప్రభుత్వ పెద్దలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాచకొండ పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో పోలీసులకు, ప్రభుత్వ పెద్దలకు ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఇసుక లారీలపై జరుగుతున్న దాడులను అరికట్టండి

- తెలంగాణ మైన్స్, ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్

వనస్థలిపురం, అక్టోబరు 25(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఇసుక లారీలపైన జరుగుతున్న దాడులు, అధికారుల వేధింపులను అరికట్టాలని తెలంగాణ మైన్స్, ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి దామోదర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీసీ కార్పొరేషన్ నిర్వహిస్తున్నటువంటి ఇసుక క్వారీల్లో లారీల్లో అధిక లోడ్ నింపడం జరుగుతుందన్నారు. లారీల్లో ఓవర్ లోడ్ నింపడంతో ఆర్టీఏ, మైనింగ్ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి లక్షల రూపాయలు చలాన్లు విధించడంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. క్వారీల్లో ఓవర్ లోడ్ చేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, క్వారీల్లో సరైన తూకం లేక బయట తూకం చేసుకునే పరిస్థితి లేకపోవడంతో క్వారీ నుంచి కొద్ది దూరం రాగానే తమపై ఆర్టీఏ దాడులు జరుగుతున్నాయన్నారు. తమపై బలవంతంగా ఓవర్ లోడ్ చేస్తూ అక్రమంగా కేసులు నమోదు చేసి వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేసి రవాణా రంగాన్ని కాపాడాలని వారు మంత్రికి విన్నవించామన్నారు. ఈ విషయంపై సత్వర న్యాయం జరిగే విధంగా తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ వెన్నపూజ పరశురామ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పందుల యాదగిరిగౌడ్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ మైన్స్, ఇసుక లారీ యజమానులు

3వ అంతస్తు నుంచి పడిపోయి పెయింటర్ మృతి

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ప్రమాదవశాత్తు 3వ అంతస్తు నుంచి కిందకు పడిపోయిన పెయింటర్ మృతిచెందిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గణేష్(19) అదే ప్రాంతానికి చెందిన అఖిలేష్, ఆజిద్, మజ్నూలతో కలిసి ఎల్‌పీటీ మార్కెట్ వెనుక మన్సూరాబాద్ చంద్రపురికాలనీలో నూతనంగా నిర్మించిన సిల్క్ టవర్స్ బహుళ అంతస్తుల భవనంలో కాంట్రాక్టర్ బానోత్ శ్రవణ్ ఆధ్వర్యంలో పెయింటింగ్ పనులు చేస్తుండేవాడు. వారందరూ అదే భవనంలోని 3వ అంతస్తులో ఉండేవారు. ఈనెల 22వ తేదీన రాత్రి అందరూ మద్యం సేవించి, భోజనం చేసి నిద్రపోయారు. 23న ఉదయం 8గంటలకు వారందరూ నిద్రలేచి చూస్తే గణేష్ మొదటి అంతస్తుపై తీవ్ర గాయాలతో పడి కనిపించాడు. వారు అతడిని నాగోల్ ఎస్ఎల్ఎంఎస్ ఆస్పత్రికి తరలించారు. చాలా సమయం క్రితమే అతడు మృతి చెందినట్లు వైద్యులు వారికి తెలిపారు. 22న అర్ధరాత్రి మద్యం మత్తులో ప్రమాదవశాత్తు అతడు 3వ అంతస్తు నుండి మొదటి అంతస్తుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అతడు మృతి చెందాడని వారు అతడి సోదరుడు జనార్దన్‌కుమార్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. జనార్దన్‌కుమార్ 23న రాత్రి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి

- సమీక్ష సమావేశంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న

చాదర్‌ఘాట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరాన్ని చెత్త రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి ప్రజలందరు పూర్తిగా సహకరించాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 కార్యక్రమంపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నామా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, శైలజ, సురేందర్, సరిత, అరుణకుమారి, రవికుమార్, శంకర్‌సింగ్, ఏఎంహెచ్‌వోలు, డీఈలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ యశస్విని స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జోనల్ కమిషనర్ మాట్లాడుతూ గ్రేటర్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.


సమీక్ష సమావేశంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న

కుంట్లూర్‌లో మొబైల్ షాపులో చోరీ

- 9 ఐటెల్ సెల్ ఫోన్‌ల అపహరణ

హయత్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): షట్టర్ తాళాలు పగుల గొట్టి సెల్ ఫోన్‌లు, బ్లూటూత్ స్పీకర్లు అపహరించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. కుంట్లూర్‌లో నివాసం ఉండే ఎర్రోజు సత్యనారాయణ కుంట్లూర్ చౌరస్తా వద్ద సత్య మొబైల్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి పది గంటల వరకు సత్యనారాయణ షాపు నిర్వహించి పది గంటలకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లారు. రాత్రి గుర్తు తెలియని దుండగులు షట్టర్ తాళాలు ధ్వంసం చేసి షాపులో ఉన్న 9 ఐటెల్ సెల్ ఫోన్‌లు, ఎం-4 స్మార్ట్ సెల్ ఒకటి, బ్లూటూత్ స్పీకర్లు, కొంత నగదును అపహరించుకుపోయారు. ఉదయం వచ్చి చూసేసరికి షట్టర్ తాళాలు తీసి ఉన్నాయి. వెంటనే అనుమానం వచ్చిన సత్యనారాయణ హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను పట్టుకుంటామని సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


అల్వాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఇంద్రసేనారెడ్డి

అల్వాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పరామర్శ

హయత్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మరణించిన రాగన్నగూడకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సామ అల్వాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పరామర్శించారు. అల్వాల్‌రెడ్డి భార్య, ఇద్దరు కూతుళ్లతో మాట్లాడారు. ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కళ్లెం బాల్‌రెడ్డి, సామ భీంరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మన్సూరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులెవరికీ చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్‌లో భార్య సీత కృష్ణవేణి, కుమార్తె సీత అనూష(19)లతో కలిసి ఫొటోగ్రాఫర్ సీత సత్యనారాయణ నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగానే అతడు వృత్తి రీత్యా బయటకు వెళ్లగా అతడి భార్య స్నానం చేసేందుకు వెళ్లింది. ఆ సమయంలో బాత్‌రూమ్ డోర్‌కు బయట నుంచి గొళ్లెం పెట్టిన అనూష తల్లి ఫోన్‌ను తీసుకుని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. సదరు నంబర్‌కు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితులను ఆరా తీసినా యువతి ఆచూకీ లభించలేదు. నరేష్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ సత్యనారాయణ వెంటనే నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.